రైతుల చూపు..ఉద్యాన పంటలవైపు

- విస్తారంగా పంటల సాగు
- లభిస్తున్న గిట్టుబాటు ధరలు
- మండలంలో 3400 ఎకరాల్లో అరటి సాగు
- మండలంలో 4 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు
- గిట్టుబాటు ధర కల్పించాలంటున్న రైతులు


సాగులో ఉన్న అరటి పంట

కాశినాయన : అన్నదాతలకు సిరులు కురిపిస్తున్న పంటలు ఉద్యాన పంటలు. ఒకప్పుడు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు రైతులు వెనకడుగు వేసేవారు. గత 15 సంవత్సరాల నుండి మండలంలో ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొదట 50 ఎకరాల్లో సాగైన అరటిపంట ఇప్పుడు 3400 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉండటంతో సాగు విస్తీర్ణంపై రైతుల ఆసక్తి పెరిగింది. ఈ ఏడాది అరటి పంటకు రైతులు ఆశించిన స్థాయిలో ధర లభించింది. మండలంలో ఎక్కువగా ఉద్యాన పంటలను వరికుంట్ల, నాయునిపల్లె, ఆకులనారాయణ పల్లె, సావిశెట్టిపల్లె, ఇటుగుల్లపాడు, పగడాలపల్లె, పాలగిరి, కోడిగుడ్లపాడు, కె.ఎన్.కొట్టాల, కొండ్రాజుపల్లె గ్రామాల్లో ఎక్కువ సాగు చేస్తారు. ఉద్యాన పంటలను ఒకసారి సాగు చేస్తే పంట రకాలను బట్టి మూడు సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు పంట వస్తుందని రైతులు అంటున్నారు. ఒకసారి అరటిపంటను సాగు చేస్తే మూడు సంవత్సరాల వరకు పంట ఉంటుందని రైతులు అంటున్నారు.

ఎకరాకు సాగు ఖర్చు

ఎకరా అరటి పంటను సాగు చేయాలంటే రూ.19 వేలు మొక్కలకు, సేద్యాలకు రూ.15 వేలు, రసాయనిక ఎరువులు, డ్రిప్ మందులకు రూ.45 వేలు, పురుగు మందులకు రూ.5 వేలు, కూలీ ఖర్చులకు రూ.10 వేలు కలిపి దాదాపు రూ.లక్ష ఖర్చు వస్తుంది. సక్రమంగా అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12 టన్నుల నుండి 18 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ధర ఆశాజనకంగా ఉంటే రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వస్తుండటంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

వివిధ రకాల ఉద్యాన పంటలు

మండలంలో ఆయిల్‌ఫామ్ 354 ఎకరాలు, మామిడి 311 ఎకరాలు, నిమ్మ 297 ఎకరాలు, జామ 285 ఎకరాలు, కొబ్బరి 275 ఎకరాలు, తమలపాకు 120 ఎకరాలు, రోజా తోటలు 112 ఎకరాలు, దానిమ్మ 104 ఎకరాలు, రేగు 61 ఎకరాలు, సీతాఫలం 52 ఎకరాలు, అంజూర 48 ఎకరాలు, నన్నారి 39 ఎకరాలు, సపోట 15 ఎకరాలు, డ్రాగన్‌ఫ్రూట్ 13 ఎకరాలు, నేరేడు 11 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

మండలంలో దాదాపు 4800 ఎకరాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటల రైతులు మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వ్యాపారులు తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్మి లాభాలు ఆర్జిస్తున్నారు. ఢిల్లీ వ్యాపారులు వస్తేనే ఎక్కువ రేటు పెడతారు. వారు రాకుంటే స్థానిక వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గిస్తారు. దీంతో రైతులు పచ్చి సరుకు కావడంతో వారు అడిగిన కాడికి ఇచ్చి నష్టపోతున్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సూచనలు పాటించాలి



ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఉద్యాన అధికారుల సూచనలు పాటించాలి. ఏ సమయంలో ఏ పంట సాగు చేయాలి, ఏ మోతాదులో మందులు వాడాలో అవగాహన కలిగి ఉండాలి. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు పంటలకు తెగుళ్ళు సోకినప్పుడు మమ్మల్ని సంప్రదించాలి. కొంత మంది రైతులు పురుగు మందుల షాపుల వద్దకు వెళ్ళి వారు ఇచ్చిన మందులను పిచికారీ చేసి నష్టపోతున్నారు. మా సూచనలు, సలహాలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు.

– శ్రీనివాసరెడ్డి, ఉద్యాన అధికారి, కాశినాయన మండలం

ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న హిందూ ధర్మ రక్షవేదిక సభ్యులు

బద్వేలు అర్బన్ : హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం హిందూ ధర్మ రక్షవేదిక సభ్యులు ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ సంఘచాలక్ రామకోటిరాజు, విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లిసుభాష్‌కుమార్ మాట్లాడుతూ హిందూ దేవాలయాల్లో వచ్చే ఆదాయం పూర్తిగా హిందూ ధర్మానికే ఖర్చు పెట్టడంతో పాటు ప్రతి ఏటా జమ ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. హరిజనవాడల్లో మతమార్పిడి ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో దేవదాయశాఖ, టీటీడీల ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా హరిజనవాడలలో దేవాలయాల నిర్మాణానికి ఖర్చు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గోపవరం మండల అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి వేణుగోపాల్‌యాదవ్, దర్శిశెట్టివెంకటసుబ్బయ్య, కిరణ్‌కుమారి, కుప్పాలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు


మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని సత్కరిస్తున్న రవికుమార్

మైదుకూరు : తనకు వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగంలో స్థానం దక్కేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి నియోజకవర్గానికి చెందిన జేష్టాది రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం రఘురామిరెడ్డిని కలిసిన రవికుమార్ ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య, మైదుకూరు మండల నాయకుడు లోకా రవి పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి సేవా పురస్కారం


సేవా పురస్కారం అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి చేస్తున్న సేవలకు గాను డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సేవారత్న పురస్కారం అందుకున్నారు. బాపట్ల జిల్లా చీరాలలోని కృతి ఫౌండేషన్ సంస్థ గత 15 ఏళ్ళుగా నిర్విరామంగా నిస్వార్థంగా సేవలందిస్తున్న రామకృష్ణారెడ్డిని గుర్తించి పురస్కారాన్ని అందించింది. ఈ అవార్డు తన బాధ్యతను పెంచేలా, తన సేవలను నిబద్ధతతో చేసేలా ఉందని రామకృష్ణారెడ్డి తెలిపారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ప్రతినెలా వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌లు డిమాండు చేశారు. ఈ మేరకు వారు మంగళవారం హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుకు వినతి పత్రం అందచేశారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో 65 మంది శానిటేషన్ కార్మికులు ఉన్నారని అయితే వీరికి రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ కూడా సంబంధిత కాంట్రాక్టర్ సకాలంలో కట్టడం లేదని తెలిపారు. ఏడాదికి రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా ఒక్క జత కూడా ఇవ్వలేదని చెప్పారు. జీఓ నంబర్ 549 ప్రకారం రూ.16 వేలు వేతనం ఇవ్వాలని వారు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి యూనియన్ గౌరవాధ్యక్షుడు రాఘవ, అధ్యక్షురాలు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కమిటి సభ్యులు రాణి, నరసింహులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కల్లూరు, కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోములవారిపల్లె, సుబ్బారావు కొట్టాలు, ఈశ్వర్‌నగర్‌లలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు, పెద్దలకు వేసవిలో అతిసార ముప్పు ఉంటుందన్నారు. ప్రజలు అతిసార వ్యాధి గురించి తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, సీహెచ్‌ఓ గంగ తులసి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రొద్దుటూరు : మూడు నెలలుగా వేతనాలు అందక కరోనా సమయంలో తీసుకున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. పలు సమస్యలపై యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే సమీపిస్తున్నా ప్రభుత్వం కరోనా కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో జాప్యం చేస్తోందన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగం ఇవ్వాలని, 60 ఏళ్ల పూర్తయిన వారి స్థానంలో వారి కుటుంబీకులకు ఉపాధి కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, కరోనా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, సర్వీసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, పనిముట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కాంప్లెక్స్‌ను నిబంధనల ప్రకారం తొలగించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్ బాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో శివచంద్రారెడ్డికి ఒక న్యాయం, సాధారణ ప్రజలకు మరొక న్యాయం చేయడం తగదన్నారు. అనేక చోట్ల సర్పంచ్ ఆక్రమణలను తొలగించకుండా డబ్బు తీసుకున్నారని, పైగా మార్కింగ్ వేసిన తన కాంప్లెక్స్‌ను తొలగించకుండా అధికారులను రాజకీయ ఒత్తిళ్లకు గురి చేశారన్నారు. ఈ అంశంపై విచారణ చేసి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శలకు తావు లేకుండా సమన్యాయం పాటించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంజూరైన డ్రైనేజీ కాలువలు, పైపులైన్ నిర్మాణ పనులు రద్దయ్యాయన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణం ఆగిపోయిందని తెలిపారు. వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల పరిస్థితి ఇదే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, గోడూరు వెంకటేష్, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి


చర్మకారుల సొసైటీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1580/బి లో గల 3.64 ఎకరాల స్థలంలో ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటిమల్లేష్ పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు పర్యటనకు వచ్చిన ఆయన తొలుత లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరురాజశేఖర్‌తో కలిసి చర్మకారుల సొసైటీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అనంతరం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల సొసైటీ నాయకులతో మాట్లాడారు. లిడ్‌క్యాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో చర్మకారుల కోసం మంజూరు చేసిన 3.64 ఎకరాల స్థలాన్ని కబ్జాకు గురికాకుండా ప్రహరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే నిరుద్యోగ యువత కోసం లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి చర్మకారులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో లెదర్ సొసైటీ అధ్యక్షుడు ఓబయ్య, దళితవేదిక జిల్లా అధ్యక్షుడు సి.ఓబయ్య, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, పిచ్చయ్య, ఆర్.ఓబయ్య, ప్రసాద్, దళిత నాయకులు జయరాజ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం మొదటి సంతకం హామీ ఏమైంది?


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీపై చేసిన మొదటి సంతకం హామీ ఏమైందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే మొదటగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని యువతకు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తవుతున్నా దాని ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కనీసం విద్యాశాఖమంత్రి అయిన లోకేష్ కూడా పలానా తేదీలో డీఎస్సీ షెడ్యూల్ ఇస్తామని చెప్పే ప్రయత్నం చేయడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 16 వేల ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని, లేనిపక్షంలో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు బాల గురవయ్య, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బద్వేలు అర్బన్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రిక్షాకాలనీ, సుందరయ్యకాలనీలలో బద్వేలు అర్బన్, రూరల్ స్టేషన్ల పరిధిలోని సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్ళను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే రికార్డులు సక్రమంగా లేని 5 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజలు చోరీలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ నివాసాల పరిసరాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, రామకృష్ణ, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ పరిధిలోని సుందరయ్య కాలనీలో మంగళవారం తెల్లవారుజామున సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, కాశినాయన ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టణ శివారులో ఉన్న సుందరయ్యకాలనీలో సోదాలు చేశారు. ఎవరైనా కొత్త వ్యక్తులు ఉన్నారా? అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నారా? కాలనీలో గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నారా? తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం కాలనీవాసులతో సీఐ సమావేశం నిర్వహించారు. అనంతరం వాహనాలు తనిఖీ చేపట్టగా రికార్డులు లేని ఆరు బైకులు స్వా.దీనం చేసుకున్నారు.

నాకాబందీ

కడప అర్బన్ : ప్రొద్దుటూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెన్నా నగర్, ఈశ్వర్ రెడ్డి నగర్ లో మంగళవారం నిర్వహించిన నాకాబందీలో రికార్డులు లేని 7 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరు వన్ టౌన్ సి.ఐ రామకృష్ణా రెడ్డి, ప్రొద్దుటూరు త్రీ టౌన్ సీఐ గోవింద రెడ్డి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో

మైదుకూరు వెంకటసుబ్బయ్య కాలనీలో 9 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, పోరుమామిళ్ల పరిధిలోని సుందరయ్య కాలనీలో 9, బద్వేలు అర్బన్ పరిధిలోని రిక్షా కాలనీ, సుందరయ్య కాలనీ లో రికార్డులు లేని 5 ద్విచక్ర వాహ నాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. మైదుకూ రు అర్బన్ సీఐ శ్రీహరి, రూరల్ సీఐ శివశంకర్, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్, రూరల్ సీఐ నాగభూషణం పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరి కుమార్, విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సీఎం డీఎస్సీపై సంతకం చేసి పది నెలలు అయినా ఇంత వరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. వెంటనే ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

విజేతలకు అభినందన

మైదుకూరు: బాపట్ల జిల్లాలో ఆది, సోమవారాల్లో జరిగిన లాక్రోస్ క్రీడా పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులను డీఈఓ శంషుద్దీన్ అభినందించారు. మంగళవారం బాయ్స్ హైస్కూల్‌ను పరిశీలించారు. తిరిగి పాఠశాలలో చేరిన డ్రాప్ అవుట్ విద్యార్థుల హాజరుపై ఈ సందర్భంగా డీఈఓ ఆరా తీశారు. అనంతరం ఈనెల 13, 14వ తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన 3వ స్టేట్ సబ్ జూనియర్, సీనియర్ జిల్లా లాక్రోస్ చాంపియన్ షిప్ 2025–26 పోటీల్లో పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని తెలుసుకుని విద్యార్థులను అభినందించి బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రామమోహన్, వ్యాయామ ఉపాధ్యాయిని చంద్రావతి, ఎంఈఓ–1 పద్మలత పాల్గొన్నారు.

ఘనంగా ముక్తి రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


రావణబ్రహ్మ వాహనంపై గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఐదో రోజు స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం ముక్తిరామలింగేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి, ప్రధాన కలశ పూజ, హోమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, దశ హారతుల కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి రావణబ్రహ్మ వాహనంపై గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈఓ శ్రీధర్, పాలకమండలి సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18 నుంచి మల్లెంకొండేశ్వరస్వామి తిరునాల

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లె గ్రామ పంచాయతీ బుచ్చనపల్లె గ్రామంలో కొలువైన శ్రీఅంకాలమ్మ సహిత మల్లెంకొండేశ్వరస్వామి తిరునాల మహోత్సవం ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. 18వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుండి అమ్మవారికి పాలాభిషేకం, చండీయాగం, శనివారం ఉదయం 8 గంటల నుండి అమ్మవారి కార్యక్రమాలు, ఆదివారం పొంగళ్ళు, మంగళహారతి, తీర్థప్రసాదములు, మధ్యాహ్నం 2 గంటలకు బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాల్గవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. వచ్చిన భక్తులకు మూడు రోజులు ఉదయం నుండి సాయంత్రం వరకు అన్నదానం ఉంటుందన్నారు. ఈ తిరుణాల మహోత్సవాలకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి


విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


ఆర్టీసీ బస్టాండు ఆవరణలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శివాలయం సెంటర్, ఆర్టీసీ బస్టాండుల వద్ద మంగళవారం అగ్నిప్రమాదాల సమయంలో ఉపయోగించే వివిధ రకాల వాటర్ నాజిల్లతో విన్యాసాలు చేశారు.

బద్వేలు అర్బన్ : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన అవసరమని బద్వేలు ఫైర్ ఆఫీసర్ ఎం.చంద్రుడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయిల్ లీకేజి మంటలను ఎలా అదుపు చేయాలి, బహుళ అంతస్థు భవనాల్లో ప్రమాదం సంభవిస్తే ప్రజలను ఎలా కాపాడాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్లు సుధాకర్, హరికృష్ణ, డ్రైవర్ ఆపరేటర్ చెన్నయ్య, లైన్‌మెన్లు కృష్ణనాయక్, శ్రీనివాసులరెడ్డి, సిద్దేశ్వర, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అగ్నిమాపక అధికారి నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయాణికులకు, వ్యాపారులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు చోట్ల విన్యాసాలు ప్రదర్శించారు.

అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు

మైదుకూరు : మైదుకూరులో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది విన్యాసాలను నిర్వహించారు. అంతకు ముందు స్థానిక పొట్టి శ్రీరాములు కూడలి, రాయల కూడలి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పిస్తూ ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కేంద్రం ఇన్‌చార్జి బి.సత్యరాజు ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఏ విధంగా ఆర్పాలనే విషయంపై వారు అగ్నిమాపక యంత్రాలతో విన్యాసాలను ప్రదర్శించారు.


ప్రతి రంగంలోనూ డ్రోన్ టెక్నాలజీ వినియోగం


డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న ఆనంద్

చాపాడు: ప్రతి రంగంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగించనున్నారని, తద్వారా కష్టతరమైన పనులు సులభమవుతాయని చెన్నైకు చెందిన గరుడ ఎయిర్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి డా.ఆనంద్ అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి(సీబీఐటీ)కాలేజీలో మంగళవారం రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించారు. తొలి రోజున హాజరైన అతిథి డా.ఆనంద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మనిషి చేసే పనులకు తోడుగా టెక్నాలజీ ఉపయోగపడుతోందన్నారు. వ్యవసాయరంగంలో రైతుకు సహాయంగా పంట ఆరోగ్యాన్ని పరిశీలించడం, ఎరువులు చల్లడం, పురుగు మందులను పిచికారీ చేయడం, భూముల వివరణాత్మక మ్యాప్‌లను రూపొందించడం, అగ్ని ప్రమాదాలు గుర్తించడానికి సాంకేతికత సహాయపడుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అడవుల పర్యవేక్షణ, వన్య ప్రాణుల గమనం, నైట్ సర్వేయింగ్, పర్యవేక్షణ, విపత్తు సమయాల్లో డెలివరీ సేవలను డ్రోన్ ద్వారా అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ధాన్యం ధర.. రైతుకు తప్పని వ్యథ!

రూ.14వేల నుంచి
రూ.11,500లకు తగ్గిన ధరలు


చాపాడు మండలం అయ్యవారిపల్లె సమీపంలో వరి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న దృశ్యం

చాపాడు : మొదటి కారులో వచ్చిన నష్టాన్ని రెండో కారులో పూడ్చుకోవచ్చనే ఆశ, ఆలోచనతో రైతులు ఏటా రెండు కార్లలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇదే క్రమంలో వరి సాగు రెండో కారుపై రైతులు దృష్టి సారించారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో ధరలు ఆశించిన రకంగా కన్పించగా పంట చేతికి రాగానే ధరలు క్రమంగా తగ్గిపోతున్నాయి. దీంతో రైతులు రెండో కారులో కూడా నష్టపోవాల్సిందేనా అంటూ గగ్గోలు పెడుతున్నారు.

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా కేసీ కాలువ కింద, బోరుబావులు, కుందూనది పరీవాహకంలో రైతులు వరి సాగు చేశారు. ఖరీఫ్‌లో పంట దిగుబడులు తగ్గిపోగా ధరలు ఓ మోస్తరుగా ఉండటంతో చావు తప్పి కన్ను లొట్టపోయిందన్న చందంగా నష్టాల బారి నుంచి రైతులు తప్పించుకుంటున్నారు. దీంతో రెండో కారులోనైనా లాభాలు ఆర్జిద్దామని జై శ్రీరాం, ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి సాగు చేశారు. నియోజకవర్గంలోని మైదుకూరు మండలంలో 500 ఎకరాలు, చాపాడు మండలంలో 680 ఎకరాలు, ఖాజీపేట మండలంలో 400 ఎకరాలు, దువ్వూరు మండలంలో 200 ఎకరాల చొప్పున రైతులు రెండో కారులో వరి సాగు చేశారు. గత రెండు వారాలుగా పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరాకు 32 నుంచి 34 బస్తాల వరకూ దిగుబడులు వస్తున్నాయి. దిగుబడులు ఓ మోస్తరుగానే వస్తున్నప్పటికీ జై శ్రీరాం, ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు దళారులు మొగ్గు చూపడం లేదు.

రూ.14వేల నుంచి రూ.11,500లకు తగ్గిన ధాన్యం ధరలు..

ఈ ఏడాది రెండో కారుగా సాగు చేసి వరి ధాన్యం ధరలు క్రమంగా తగ్గిపోతున్నాయి. మార్చి నెలాఖరులో వరి పంట నూర్పిళ్ల ఆరంభంలో పుట్టి(8బస్తాల) వరి ధాన్యం రూ.14వేలు ఉన్నది. ఏప్రిల్ ఆరంభం నుంచి రోజు రోజుకు ధరలు తగ్గుతున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే రూ.14వేల నుంచి రూ.12వేలకు ధర పడిపోయింది. ప్రస్తుతం రూ.11,400 నుంచి 12వేల వరకూ ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది రూ.13–14వేలకు దళారులు పోటీపడి వరి ధాన్యం కొనుగోలు చేయగా ఈ ఏడాది ధరలు తగ్గిస్తూ కొనుగోలు చేస్తున్నారు. పుట్టి రూ.14వేలు ఉంటేనే పెట్టుబడులు పోను రైతుకు కాసింత లబ్ధి చేకూరుతుందని లేకుంటే పూర్తిగా నష్టపోతామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని దళారుల దోపిడీ లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుకు గిట్టుబాటు అయ్యే విధంగా పుట్టి ధాన్యం రూ.14వేలకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.